# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

## తీరుమారిన బీజేపీ

**రాజస్థాన్‌లో** ఇటీవల ఓ రాజకీయ అద్భుతం చోటుచేసుకున్నది. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల ఫొటో తీసినప్పుడు మూడోవరుసలో అనామకునిలా ఉండిపోయిన వ్యక్తి తెల్లారేసరికల్లా ముఖ్యమంత్రి అభ్యర్థిగా ముందుకువచ్చాడు. ఆయనే మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన భజన్‌లాల్ శర్మ. బీజేపీ కేంద్ర నాయకత్వం ఎంపికపై చాలామంది ముక్కు మీద వేలేసుకున్నారు. మూడు హిందీ రాష్ర్టాల్లో, అంటే రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ ఘనవిజయం సాధించినప్పటికీ సీఎంల ఎంపిక తాత్సారం కావడం రాజకీయ వర్గాల్లో చర్చాంశమైంది. ఎంత సులభంగా గెలిచిందో, లెజిస్లేచర్ పార్టీల నేతల ఎంపిక అంత కత్తి మీద సాము అయ్యింది బీజేపీ పెద్దలకు. ఇంతలా మల్లగుల్లాలు పడటానికి కారణం ఏమై ఉంటుందా అనే కోణంలో ఊహాగానాలు కూడా జోరుగా సాగాయి. చివరికి సీఎం అభ్యర్థుల పేర్లు ఒకటొకటిగా బయటకు రావడం మొదలుపెట్టాయి. రాజస్థాన్‌కు శర్మతో పాటుగా మధ్యప్రదేశ్‌కు మోహన్ యాదవ్, ఛత్తీస్‌గఢ్‌కు విష్ణుదేవ్ సాయిని ఎంపిక చేసినట్టు బీజేపీ పెద్దలు వెల్లడించారు. ఇలా పూర్తిగా కొత్తవారిని ఎంపిక చేయడంపై సొంతపార్టీలోనే విస్మయం వ్యక్తమైంది. ఈ ఎంపికలు మారుతున్న బీజేపీ రాజకీయ ఎత్తుగడల స్వరూప స్వభావాలను చెప్పకనే చెప్పాయి.

బీజేపీ సంప్రదాయిక ఎంపికల విధానానికి భిన్నంగా పూర్తిగా కొత్త ముఖాలకే చోటు కల్పించింది. భజన్‌లాల్ శర్మ విషయంలో మరీ విడ్డూరం. అంతవరకు అసెంబ్లీ ముఖమే ఎరుగని వ్యక్తికి సీఎం పట్టం గట్టారు. ఇలా కొత్తవారిని తెచ్చి సత్తా నిరూపించుకోమని చెప్పి, పాతుకుపోయిన పాతతరం నాయకులను పక్కన పెట్టేశారు. ఎక్కడా ఎవరూ శాశ్వతం కాదనే సందేశం కూడా దీనవెనుక ఉండవచ్చు. కొత్తవారైతే పూర్తి విధేయులుగా ఉంటారు, సీనియర్లతో వచ్చే చిక్కులు ఉండవని మోదీ-షా ద్వయం ఆలోచించినట్టు కనబడుతున్నది. వసుంధరా రాజే సింధియా, శివరాజ్ సింగ్ చౌహాన్, రమణ్ సింగ్ వంటి సుదీర్ఘ అనుభవం ఉన్న నేతలను విశ్రాంతి తీసుకోమని చెప్పడం గమనార్హం. దీని ద్వారా బీజేపీ కేంద్ర నాయకత్వం ఒకే వేటుతో ప్రాంతీయ సామంతుల బెడదను తప్పించుకున్నది. ఒక్క యూపీ సీఎం యోగి మాత్రమే ఇందుకు మినహాయింపు. తాజా ఎంపికలతో ముగ్గురు ఘనాపాటీల రాజకీయ భవితవ్యంపై నీలినీడలు పరుచుకున్నాయి. రమణ్‌సింగ్‌ను క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉండే స్పీకర్ పదవికి ఎంపిక చేసినప్పటికీ వసుంధర, శివరాజ్‌లకు ఎలాంటి ప్రత్యేక బాధ్యతలు అప్పగించలేదు. దీంతో వారు రాజకీయాల నుంచి క్రమంగా తెరమరుగుకావడం తప్ప వేరే గత్యంతరం లేదన్న విశ్లేషణలు ముందుకువస్తున్నాయి.

హిందుత్వ రాజకీయాలు కొత్తమలుపు తిరిగినట్టు కనబడుతున్నది. కేవలం మతం పేరిట ఓట్లు రాబట్టడానికి గల పరిమితులను బీజేపీ గుర్తించిందనే చెప్పాలి. అందుకే ఆచితూచి కులాలవారీగా ఎంపికలు జరిపినట్టు భావిస్తున్నారు. బ్రాహ్మణ, ఓబీసీ, గిరిజన సామాజిక వర్గాలకు పెద్దపీట వేయడం విశ్లేషకుల దృష్టిని ఆకర్షించక పోలేదు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఆయావర్గాల ఓట్లను ఆకర్షించే ఆలోచనతోనే ఇది జరిగిందనేది తెలుస్తూనే ఉన్నది.

# ప్రజాస్వామ్య గర్భగుడిపైనే దాడులా?

**డిసెంబర్ 13న నూతన పార్లమెంటు భవనంలోని లోక్‌సభ సందర్శకుల గ్యాలరీ నుంచి ఒక వ్యక్తి సభలోకి దూకిన దుశ్చర్య యావన్మందినీ ఆందోళనకు గురిచేసింది. ఇది డిసెంబర్ 13న జరగటంలో ఏదన్న కుట్ర ఉన్నదా లేక యాదృచ్ఛికమా అన్నది పోలీసుల విచారణలో తేలవలసి ఉంటుంది. డిసెంబర్ 13ను కావాలనే ఎంచుకుంటే గనక ఇది చాలా సీరియస్ విషయంగా భావించాలి. ఎందుకంటే 22 ఏండ్ల కిందట సరిగ్గా ఇదేరోజున ఉగ్రవాదులు పార్లమెంటు మీద దాడిచేసిన విషయం దేశం ఎప్పటికీ మరిచిపోలేదు. నాడు దుండగులు భద్రతా దళాల వేషంలో వచ్చి భద్రతా దళాల కన్నుగప్పి పార్లమెంటు ప్రాంగణంలోకి సులువుగానే ప్రవేశించగలిగారు. ఆ సంఘటన తర్వాత పార్లమెంటు భద్రతను చాలా కట్టుదిట్టం చేశారు. సందర్శకుల గ్యాలరీ నుంచి సభలోకి దూకటం 1994లో రెండుసార్లు జరిగింది. మొదటిసారి మే నెలలో, రెండోసారి ఆగస్టు నెలలో. ఆనాడు దాన్ని అంత సీరియస్‌గా పరిగణించలేదు. తొలిసారి దుండగుడిని గట్టిగా మందలించి వదిలేశారు. రెండోసారి రెండురోజుల కారాగార శిక్ష విధించి తీహార్ జైలుకు తరలించారు. అంతటితో సభలోకి దూకిన ఆ ఉదంతాలు చరిత్రలో కలిసిపోయాయి.**



**గుమ్మడిదల రంగారావు**

**2001** నాటి ఘటనలో తొమ్మిది మంది సిబ్బంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. పార్లమెంటు భద్రతా విభాగం సమయస్ఫూర్తితో భవనం తలుపులు మూసివేయటంతో దుండగులు భవనంలోకి ప్రవేశించలేకపోయారు. భవనంలోనికి ప్రవేశించగలిగితే ఏం జరిగి ఉండేదో ఊహించటం కూడా కష్టమే! అప్పటికే ఆ రోజు రెండు సభలూ వాయిదా పడ్డాయి. అయితే, అంతటి ఘోరమైన ఘాతుకం జరిగిన నేపథ్యంలో, ఏ మాత్రం తత్తరపాటుకు గురికాకుండా, యథావిధిగా రెండు సభలూ మరుసటి రోజు ఉదయం 11 గంటలకు సమావేశమై, కిందటి రోజు జరిగిన దాడిలో అశువులు బాసిన అమరవీరులకు నివాళులు అర్పించటాన్ని యావత్ భారతదేశం, వాస్తవానికి యావత్ ప్రపంచం కూడా, ఒక రాజ్యాంగ వ్యవస్థగా మన పార్లమెంటును, పార్లమెంటు సభ్యులను ఎంతో గర్వంగా చూసింది. అంతటి ఘాతుకం జరిగిన మరునాడే సమావేశం కావడం ద్వారా 'మమ్మల్ని ఎవరూ భయపెట్టలేరు' అన్న స్థిరమైన సందేశాన్ని మన పార్లమెంటు ప్రపంచానికి వినిపించింది.

ఆ తర్వాత పార్లమెంటు ప్రాంగణం చుట్టూ కట్టుదిట్టమైన భద్రతా వలయాన్ని ఏర్పాటుచేశారు. నాలుగు చోట్ల క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే సభా కార్యకలాపాలను వీక్షించే సందర్శకులను గ్యాలరీల లోనికి అనుమతించేవారు. కానీ, సందర్శకులను ఆపకపోవడం గమనార్హం. ఢిల్లీ వెళ్లే సందర్శకులు రాజ్‌ఘాట్‌ను, ఆ పక్కనే ఉన్న నెహ్రూ, లాల్‌బహదూర్‌శాస్త్రి సమాధులను చూస్తారు. ఆ తర్వాత రాష్ట్రపతి భవనం, పార్లమెంట్ భవనం చూడాలనుకుంటారు. రాష్ట్రపతి భవనాన్ని బయటి నుంచి మాత్రమే చూడగలరు. లోనికి ప్రవేశం లేదు సందర్శకులకు. అయితే, పార్లమెంటును చూసే వీలుంది. దానికి ఒక పద్ధతి ఉంది. ఆ పద్ధతిని పాటిస్తే పార్లమెంటు భవనంలోని ముఖ్య విభాగాలైన లోక్‌సభ ఛాంబర్, రాజ్యసభ ఛాంబర్, చారిత్రిక సెంట్రల్ హాలును సమావేశాలు లేనప్పుడు సందర్శకులు చూసే వీలుండేది కొవిడ్ ముందువరకు. ఆ తర్వాత పరిస్థితిలో మార్పు వచ్చింది. కరోనా నిబంధనల ప్రకారం కొంత కాలం సందర్శకులకు, మీడియా ప్రతినిధులకు పార్లమెంటు భవనంలోనికి ప్రవేశాన్ని నిలిపివేశారు.



అయితే ఇటీవల నూతనంగా నిర్మించిన పార్లమెంటు భవనంలో సభా కార్యక్రమాలు ప్రారంభమైన సమావేశాలను వీక్షించటానికి సందర్శకులను మళ్లీ అనుమతిస్తున్నట్టు తెలుస్తున్నది. ఈ క్రమంలోనే నిన్న సమావేశాలు చూడటానికి వచ్చిన ఒక వ్యక్తి సందర్శకుల గ్యాలరీ నుంచి సభలోకి దూకిన దుశ్చర్య చోటు చేసుకున్నట్టు తెలుస్తున్నది. ఈ దుండగులు ఏదైన తీవ్రవాద సంస్థకు చెందినవారా అన్నది ఇంకా నిర్ధారణ కాలేదు. సంగతి పూర్తిగా తెలియకుండా ఇలాంటి సెన్సిటివ్ విషయాల్లో మనం ఒక నిర్ణయానికి రాకూడదు! అయితే ఇది చాలా తీవ్రమైన ఘటన అనటంలో ఎలాంటి సందేహం లేదు. అందరూ ఈ దుశ్చర్యను ముక్తకంఠంతో ఖండిస్తున్నారు.

> **మన పార్లమెంటు కేవలం ఒక భవనం మాత్రమే కాదు, దేశ సార్వభౌమత్వానికి ప్రతీక. 2001లో పార్లమెంటు మీద జరిగిన దాడిని మన సార్వభౌమాధికారాన్ని సవాల్ చేసినట్టుగా భావించారు ప్రజలు. ఈనాటి దుశ్చర్య ఆనాటి దుశ్చర్యంతటి తీవ్రమైనది కాకపోయినప్పటికీ ప్రజలలో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది.**

ఈ సంఘటన నేపథ్యంలో ప్రజలు పార్లమెంటు సమావేశాలు చూసే సదుపాయాన్ని నిలిపివేసినట్టు వార్తలు వస్తున్నాయి. ఈ సదుపాయాన్ని నిలిపివేయటం బహుశా తాత్కాలికమని భావించవచ్చు. ఈ సంఘటన నేపథ్యంలో పార్లమెంటు భద్రత వ్యవస్థను మరోసారి క్షుణ్ణంగా సమీక్షించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. భద్రతా వ్యవస్థను సమీక్షించిన పిదప సందర్శకులను మళ్లీ అనుమతిస్తారని అనుకోవచ్చు. మన మీడియా పార్లమెంటును ప్రజలకు నెగెటివ్‌గా చూపించే ప్రయత్నం చేస్తుంది. కానీ, ప్రజలకు పార్లమెంటులో ఏం జరుగుతుందో తెలుసుకోవాలన్న ఉత్సుకత ఉంటుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వ విధి విధానాల రూపకల్పన, ఆ విధి విధానాల మీద వాడివేడి చర్చ జరిగే గర్భగుడి పార్లమెంటు ప్రాంగణం. అంతటి ప్రాశస్త్యం ఉన్న చోటును చూడాలన్న కోరిక చాలామందికి ఉంటుంది. అది వీలు పడుతుందా లేదా అన్నది వేరు విషయం. కానీ, కోరిక మాత్రం ఉంటుంది. కాదనలేం.

ఢిల్లీ చూడటానికి వెళ్లిన వాళ్లలో పార్లమెంటును చూడాలన్న కోరిక చాలామందికి ఉన్నప్పటికీ, చూసే అవకాశం కొందరికే దక్కుతుంది. భద్రత పేరుతో ఈ అవకాశం ప్రజలకు దూరం చెయ్యకూడదు. పార్లమెంటుకూ ప్రజలకు మధ్య వారధి సందర్శకుల గ్యాలరీ. దానిలోకి ప్రవేశాన్ని కట్టుదిట్టం చెయ్యవచ్చు కాని, తలుపులు మూసివెయ్యకూడదు. పార్లమెంటు సమావేశాలు చూడాలని ప్రజలకు ఎంతో ఆసక్తి ఉంటుంది. అది అందరికీ వీలు పడకపోవచ్చు. భద్రతా ప్రమాణాలు పెంచవచ్చు. భద్రతా ప్రొటోకాల్‌ను కట్టుదిట్టం చెయ్యవచ్చు. కానీ, సందర్శకులను అనుమతించకపోవటం అనేది తప్పటడుగే అవుతుంది. మనలను మనమే అనుమానించుకున్నట్టు, అవమానించుకున్నట్టు. సందర్శకుల గ్యాలరీకి ప్రవేశం కేవలం సమావేశాలప్పుడు మాత్రమే ఉంటుంది. సమావేశాలు చూసేందుకు చాలామంది ఉత్సాహపడతారు. కానీ అవకాశం కొందరికే దక్కుతుంది. ఈ ప్రక్రియలో మార్పులు అవసరం. ఎవరైనా సామాన్యులు పార్లమెంటు సమావేశాలు చూడాలనుకుంటే చూసే వీలు కల్పించాలి. దానికి విధివిధానాలు రూపొందించి అందరికీ తెలియజేయాలి. ఆసక్తి ఉన్నవారు, వాళ్లున్న చోటునుంచే తగినంత ముందుగా అభ్యర్థన చేసుకుంటే, సరైన తనిఖీ నిర్వహించిన పిదప అనుమతించే విధానాన్ని అమలు చెయ్యాలి. సమావేశాలు లేనప్పుడు పార్లమెంటును చూసే అవకాశం కూడా సామాన్య ప్రజలకు కల్పించాలి. దానికి పార్లమెంటు సభ్యుల సిఫారసుతో పాటుగా ఎవరైనా ఎక్కడినుంచైనా ముందుగా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించాలి; తిరుమల దర్శనం తరహాలో. అవసరమైన తనిఖీలు నిర్వహించిన పిదప అనుమతించవచ్చు. పరిమిత సంఖ్యలో అయినా ఇటువంటి వెసులుబాటు ప్రజలను పార్లమెంటుకు దగ్గరచేస్తుంది.

> **దేశంలో వివిధ ప్రాంతాల నుంచి చాలా మంది న్యాయ విద్యార్థులు ఢిల్లీ వస్తుంటారు సుప్రీంకోర్టును చూడటానికి. ఆ విద్యార్థులు పార్లమెంటును కూడా చూడాలనుకుంటారు. చట్టాలను నిర్మాణం చేసేది పార్లమెంటులోనే గనుక. అటువంటివారు, స్కూల్ విద్యార్థులు గానివ్వండి, కాలేజీ/ యూనివర్సిటీ విద్యార్థులు గానివ్వండి ముందుగా అనుమతి తీసుకొని పార్లమెంటును సందర్శిస్తుంటారు.**

లోక్‌సభ సచివాలయంలో శిక్షణ విభాగం ఇటువంటి వెసులుబాటు కల్పిస్తుంటుంది వ్యవస్థాపూర్వకంగా వచ్చే విద్యార్థులకు. అయితే చాలామందికి తెలియని విషయం ఒకటి ఉంది. పార్లమెంటు ప్రాంగణంలో పార్లమెంటు లైబ్రరీ భవనం ఉంది. దీనికి ప్రవేశం వేరుగా ఉంటుంది. ఈ భవనంలో పార్లమెంటు మ్యూజియం ఉంటుంది. ఈ మ్యూజియం మన స్వాతంత్య్ర పోరాటానికి సంబంధించిన ఘట్టాలను, రాజ్యాంగ నిర్మాణానికి సంబంధించిన ఘట్టాలను లఘుచిత్రాల ద్వారా, ప్రతిమల ద్వారా ప్రదర్శిస్తు సందర్శకులను ఎంతో ఆకట్టుకుంటుంది. ఇటువంటి సదుపాయం ఉందని చాలామందికి తెలియదు. ఇది పార్లమెంటును ప్రజలకు దగ్గర చేయటంలో కీలక భూమిక పోషిస్తుంది. ప్రజలకు వ్యవస్థ పని తీరు తెలియటం మంచిదే కదా! విమానాశ్రయాల తరహాలో పార్లమెంటులో కూడా బాడీ స్కానర్లను ప్రవేశపెట్టాలన్న ప్రతిపాదన వచ్చినప్పుడు అది హక్కులను హరించేదిగా ఉన్నదని నానా హంగామా చేసింది మీడియా. ఏదన్నా జరగకూడనిది జరిగితే సరైన నియంత్రణ లేదని కూడా నానా యాగీ చేసేది కూడా మీడియానే! మన మీడియా ఈ ద్వంద్వ వైఖరిని విడనాడాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

# కశ్మీర్‌లో సర్వ మతాలకూ సమానత

**అశోకుని తదనంతరం వచ్చిన అనేక రాజులు సైతం హిందూ దేవాలయాలతోపాటుగా బౌద్ధ ఆరామాలను కట్టించారు. మహాయాన బౌద్ధ సిద్ధాంతాన్ని బోధించిన నాలుగవ బౌద్ధ మహా పరిషత్ నిర్వహించిన కుషాణ మహారాజు కనిష్కుడు (క్రీస్తుశకం 78-144) కశ్మీర్‌ను పాలించాడు. బుద్ధ చరితను రాసిన అశ్వఘోషుడు, ప్రముఖ బౌద్ధ తాత్వికులు నాగార్జునుడు, వసుగుప్తుడు కనిష్కుని ఆస్థానంలో ఆదరాభిమానాలు చూరగొన్నవారే. కనిష్కుడు రాజ్యాభిషేకం చేసిన క్రీస్తుశకం 78 నుంచి శక సంవత్సరాన్ని గణించడం ప్రారంభమైనదని కొందరు చరిత్రకారుల అభిప్రాయం. కనిష్కుని కాలంలోనే నాగార్జునాచార్యుని బోధనల ప్రభావంతో కశ్మీర్ అంతటా బౌద్ధమతం వ్యాపించి ప్రాధాన్యం సంతరించుకున్నదని రాజతరంగిణి వివరించింది (1వ తారంగం: 177వ శ్లోకం). అయితే, శైవ, వైష్ణవ, బౌద్ధ అనుయాయుల మధ్య ఘర్షణలు జరిగేవని కల్హణుడు వెల్లడించాడు.**

**కుషాణుల తర్వాత కశ్మీర్‌ను పాలించిన రెండవ చంద్రదేవుడు బౌద్ధమతాన్ని వ్యతిరేకించాడనీ, భరింపజాలని బౌద్ధ భిక్షు తెగలను చంద్రదేవుడు అంతం చేశాడని రాజతరంగిణి చెప్పుంది (1వ తారంగం: 184వ శ్లోకం). ప్రముఖ బౌద్ధ భిక్షువు కుమారజీవుడు (క్రీస్తు శకం 344-413) కశ్మీర్‌లోని శారదా పీఠంలో విద్యాభ్యాసం చేశాడు. ప్రపంచంలోకెల్లా అతిపెద్ద గ్రంథాలయాల్లో శారదాపీఠం ఒకటిగా గుర్తింపు పొందింది. టిబెట్ భాష, లిపి ఈ పీఠంలోనే రూపుదిద్దుకున్నదని చెప్తారు.**



**ఆనందేశి నాగరాజు**
**98488 38323**

**ఇస్లాం, సిక్కు మతాల ప్రవేశం:** క్రీస్తుశకం 1301లో కశ్మీర్‌ను సహదేవుడు పరిపాలిస్తున్న తరుణంలో పర్యటించిన సూఫీ మతానుయాయి బుల్ బుల్ షా ఇస్లాం మతాన్ని కశ్మీర్‌లో ప్రచారం చేశాడు. తర్వాత ఆఫ్గనిస్థాన్‌లోని స్వాత్ ప్రాంతం నుంచి వలస వచ్చిన షామీర్ కశ్మీర్‌ను పరిపాలిస్తున్న కోటారాణి ఆంతరంగిక సలహాదారుగా పదోన్నతి పొంది క్రీస్తుశకం 1339లో కుట్ర చేసి ఆమెను పదవీచ్యుతురాలిని చేసి కశ్మీర్ రాజపదవి చేపట్టాడు. ఇతని కాలంలోనే వందలాది సూఫీ సన్యాసి షా హందమ్ అనుయాయులు కశ్మీర్‌లో స్థిరపడి ఇస్లాం వ్యాప్తికి కృషిచేశారు. అయితే, కశ్మీర్ చరిత్రలో అతిహేయమైన మత మారణకాండను సుల్తాన్ సికందర్ (క్రీస్తుశకం 1389-1413) రక్తాక్షరాలతో లిఖించాడు.

ఇస్లామిక్ రాజ్యంలో ఇస్లామేతరులు బతుకడానికి అనుమతించే జిజియా పన్నును హిందువులపై విధించాడు. హిందువులు తమ నుదుటిన తిలకం దిద్దుకోవడం నిషేధించాడు. వేలాది హిందువులను బలవంతంగా మతమార్పిడి చేశాడు. కశ్మీర్‌లోని హిందూ దేవాలయాలను ధ్వంసం చేసి బత్ శికన్(విగ్రహ విధ్వంసకుడు) అనే బిరుదు పొందాడు. ఇతని కాలంలో విధ్వంసానికి గురికాని పట్టణంలోని, నగరంలోని, గ్రామంలోని, పల్లెలోని గుడులు గాని, విగ్రహాలు గాని లేవని చెప్తారు. సుల్తాన్, అతని మంత్రి లాయక్ సైఫుద్దీన్ కశ్మీర్ హిందువులను బలప్రయోగంతో బలవంతపు మతమార్పిడులు చేశారు. హిందువులపై జరిగిన ఈ అమానుష అణచివేత వల్ల వేలాది హిందువులు కశ్మీర్ నుంచి వేరే ప్రాంతాలకు వలస పోవడం వల్ల కశ్మీర్ చరిత్రలో మొదటిసారి కశ్మీరీ పండితుల జనాభా గణనీయంగా తగ్గింది. ఇది కశ్మీర్‌లో హిందువుల మొదటి జన హననం.

ఇక్కడొక విషయం మనం గమనించాలి. గతంలో కశ్మీర్ రాజులు కొందరు రాజ ధనాగారాన్ని నింపడానికి దేవాలయాలను, బౌద్ధ ఆరామాలను దోచుకున్న ఉదంతాలున్నాయి. క్రీస్తుశకం 950లో కశ్మీర్‌ను పాలించిన కుమారగుప్తుడు బౌద్ధ విహారంలో దాక్కున్న తిరుగుబాటు నాయకుడిని చంపడానికి శ్రీనగర్‌లోని ఒక దేవాలయంలోని ఇత్తడి బుద్ధుని విగ్రహాన్ని సంగ్రహించి దేవాలయాన్ని మంటలకు ఆహుతి చేశాడు. ప్రపంచవ్యాప్తంగా తన ఖ్యాతి విస్తరిస్తుందన్న భ్రమలో ఆ మూర్ఖపు

**కశ్మీరియత్..ఓ మహోజ్వల గాథ-2**



రాజు కాలిన బౌద్ధవిహార స్థానంలో క్షేమ గౌరీశ్వరి దేవాలయాన్ని నిర్మించాడని రాజ తరంగిణిలో తెలియజేశాడు (6వ తారంగం: 171-173 వ శ్లోకం). కల్హణుడు మరో కశ్మీర్ రాజు శంకరవర్మ గురించి చెప్తూ ప్రతిరోజు కొత్త వ్యసనాలకు బానిసై తన కోరికలు తీరడానికి సరిపడా ధనం లేక అతను తరచుగా వివిధ సాకులు చూపి దేవాలయాలను దోచుకున్నాడని చెప్పాడు (5వ తారంగం: 166వ శ్లోకం). కానీ, సుల్తాన్ సికందర్ మాత్రం ధనం కోసమో, తిరుగుబాటును అణచడానికో కాకుండా మతోన్మాదంతోనే బలవంతపు మత మార్పిడులకు, ఇస్లాంకు విరుద్ధమైన విగ్రహారాధన అణచివేతకే చర్యలు తీసుకున్నాడని స్పష్టమవుతుంది. కశ్మీర్‌లో ఇస్లాం ప్రకారం షరియా చట్టం అమలును పర్యవేక్షించడానికి షైక్ ఉల్ ఇస్లాం సంస్థను నెలకొల్పడాన్ని బట్టి అతని ఇస్లాం మతరాజ్య స్వభావం బోధపడుతుంది. ఇస్లాంకు వ్యతిరేకమని అతను భావించిన సంగీత, నృత్య, నాటక ప్రదర్శనలు, మద్యపానం, జూదశాలలను నిషేధించాడు.

అయితే, అతని తర్వాత క్రీస్తుశకం 1429లో కశ్మీర్‌ను పాలించిన జైన్ ఉల్ అబిదీన్ మాత్రం సికందర్ ప్రవేశపెట్టిన మతోన్మాద చట్టాలన్నిటిని రద్దు చేశాడు. తన రాజ్యంలోని అన్ని మతాలవారిని సమదృష్టితో చూశాడు. అతను పర్షియన్, సంస్కృత కవులను ప్రోత్సహించాడు. ప్రాంతీయ వృత్తులకు ఊతమివ్వడంతో పాటు అనేక సుందరమైన ఉద్యాన వనాలను, పంట కాలువలను నిర్మించాడు. సంగీత, నాట్య కళలను ప్రోత్సహించాడు. మొఘల్ చక్రవర్తి అక్బర్ పాలనలో కూడా కశ్మీర్ అన్ని మతాల సహజీవాన్ని చవిచూసింది. అయితే, ఔరంగజేబు మతోన్మాద పాలనలో తిరిగి దుర్భర అణచివేతకు గురైంది.

**అఫ్ఘానీలు-సిక్కులు:** ఆఫ్ఘన్ రాజు అహ్మద్ షా అబ్దాలీ పాలన కశ్మీర్‌లో క్రీస్తుశకం 1753లో ప్రారంభమైంది. సుమారు యాభై ఏండ్లు కొనసాగిన ఆఫ్గన్ల పాలనలో కశ్మీర్ పండితులపైనా, షియా ముస్లింలపైనా అనేక అత్యాచారాలు జరిగాయి. అప్పటి ఘోరాలను ఉదహరిస్తూ మత మార్పిడికి ఒప్పుకోని కశ్మీర్ పండితుల తలలకు గుదిబండను కట్టి ఆఫ్ఘన్ గవర్నర్ అసద్‌ఖాన్ కశ్మీర్‌లో దాల్ సరస్సులో పారవేయించాడనీ, అప్పటినుంచి దాల్ సరస్సు దగ్గరి ఆ ప్రాంతాన్ని బత్ మజార్ (విగ్రహారాధకుల స్మశానం)గా పిలవబడుతుందని చెప్తారు. ఇది కశ్మీర్‌లో హిందువుల రెండో జనహననం.

సిక్కు మత గురువు మహారాజా రంజిత్‌సింగ్ క్రీస్తుశకం 1819లో కశ్మీర్‌ను పాలించాడు. కశ్మీర్‌ను క్రీస్తుశకం 1846 నుంచి డోగ్రాలు ఏలారు. మహారాజు గులాబ్ సింగ్ క్రీస్తుశకం 1846లో బ్రిటిష్ వారి నుంచి కశ్మీర్‌ను కొనుగోలు చేశాడు. వీరిలో మహారాజా హరిసింగ్ 1926లో కశ్మీర్‌కు రాజై భారతదేశం స్వాతంత్య్రం పొందేవరకు కొనసాగాడు.

(ఇంకా ఉంది...)



## కొత్త చుట్టం ముందు..

పావు వంతు పాలు
ముప్పావు వంతు నీళ్లు
నిరుడు
అటువైపే మొగ్గింది

కొన్ని జ్ఞపకాలు అత్తరు బుడ్లు
కొన్ని కలతగూళ్ళు

కాలం నెమలీక
పెయ్యి నిమురుతున్నది
పొద్దు మాపు గంజికుండ
నిత్య పరమాన్నం

రాత్రి వచ్చిన చుట్టంలా
ఇంకో ఏడాది
తెల్లవారక ముందే తోక ముడుచుకున్నది

ఎప్పటిలాగే
గోడమీది క్యాలెండరు ఎగిరిపోయింది
అలవాటు కొద్ది
తావు దొరకబట్టుకుని
మరో పన్నెండు రెక్కల పిట్ట
అక్కడే వాలిపోయింది

నవ్వేటోని ముందు బోర్లవడ్డట్టు
నిన్నటేడు
కాసులు రాలని కష్టానికి
కలలు వాడిపోయిన దుఃఖం

తిన్నది లేదు
దాచుకున్నది లేదు
కొత్త చుట్టం ముందు
కోడలు అంగలార్చుతున్నది...



**గజ్జెల రామకృష్ణ**
**89774 12795**




## అన్ని భాషలనూ గౌరవించాలి

*గోవా విమానాశ్రయంలో ఓ తమిళ ప్రయాణికుడిని హిందీ రానందుకు సీఐఎస్ఎఫ్ సిబ్బంది వేధించడం ఆందోళన కలిగిస్తున్నది. ఇది ఏ ఒక్కరి సమస్యనో కాదు, వ్యవస్థీకృతమైన దురుసుతనాన్ని సూచిస్తున్నది. మన సుసంపన్నమైన సాంస్కృతిక, భాషా పరమైన వైవిధ్యం గురించి సీఐఎస్ఎఫ్ తమ సిబ్బందికి అవగాహన కల్గించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలి. అన్ని భాషలకు సమాన గౌరవం దక్కేలా చూడటం మనందరి బాధ్యత.*

**- ఎంకే స్టాలిన్,** తమిళనాడు ముఖ్యమంత్రి

